TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

**విలేఖరులు కావలెను...**

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 68 | శుక్రవారం25-10-2024 | పేజీలు : 5 | వెల :4/-

## అంతరాష్ట్ర పోలీసు అధికారుల భేటీ

- గడ్చిరోలిలో సమావేశం
- మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో
- మావోయిస్టులను కట్టడి చేసేందుకు



**గడ్చిరోలి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంత రాష్ట్ర పోలీసు అధికారులు సమావేశమయ్యారు. నవంబర్ 20న జరిగే ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు మహారాష్ట్ర నలువైపులా ఉన్న రాష్ట్రాల పోలీస్ అధికారుల సమావేశం గురువారం గడ్చిరోలిలో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుండి రామగుండం పోలీస్ కమిషనర్, ఐజి శ్రీనివాస్, గడ్చిరోలి డిఐజి

మిగతా 2లో

## అంతరిక్ష యాత్రకు టికెట్లు రెడీ

- నేటి నుంచే విక్రయం
- ఒక్కో టికెట్ రేటు జస్ట్ రూ.1.77 కోట్లు
- అందుబాటులో రెండు సీట్లు మాత్రమే
- అధికారికంగా ప్రకటించిన డీప్ బ్లూ ఏరోస్పేస్



**హైదరాబాద్ :** చైనాకు చెందిన స్టార్టప్ డీప్ బ్లూ ఏరోస్పేస్ 2027లో అంతరిక్ష యాత్రకు ప్రయాణికులను తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈక్రమంలో అంతరిక్షంలోకి వెళ్లే రాకెట్‌లోని రెండు సీట్ల టికెట్లు విక్రయానికి పెట్టింది.
ఈ టికెట్టు ధర 1.5 మిలియన్ యువాన్లుగా (భారత కరెన్సీలో అక్షరాల రూ.1.77 కోట్లు) తెలిపింది. ఈ టికెట్లు నేటి నుంచి తమ వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించింది. సబ్ ఆర్బిటల్ ఫ్లైట్‌లో

మిగతా 2లో

# సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

## సింగరేణి కార్మికులు ఫుల్ జోష్. దీపావళి బోనస్ నిధులు విడుదల

- దీపావళి బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడి
- ఒక్కో కార్మికుడి ఖాతాలో రూ.93,750 జమ చేయనున్న సింగరేణి సంస్థ
- 40 వేల మంది కార్మికుల ఖాతాల్లో రేపటి వరకు నగదు జమ
- బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల
- గత ఏడాది కన్నా ఇది రూ. 50 కోట్లు అధికం
- ఒక్కొక్క కార్మికునికి రూ. 93,750 బోనస్ చెల్లింపు
- రేపటి లోగా కార్మికుల ఖాతాల్లో బోనస్ జమ
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు




**హైదరాబాద్ :** సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్మికులకు దీపావళి బోనస్ కింద రూ.358 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. రేపు మధ్యాహ్నం లోగా 40 వేల మంది కార్మికుల ఖాతాల్లో ఈ మొత్తం జమ అవుతాయని వెల్లడించింది. దీపావళి బోనస్ కింద ప్రతి కార్మికుడి ఖాతాలో రూ.93,750 క్రెడిట్ కానుంది. ఈరోజు సింగరేణిపై సచివాలయంలో జరిగిన సమీక్షలో బోనస్ జారీ చేయాలని ఉపముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది కంటే ఈసారి 50 కోట్ల అదనపు బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బొగ్గు పరిశ్రమ కోసం జేబీసీసీఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంది.

ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా భట్టివిక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.
ఇటీవలే ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద రూ.796 కోట్లను కంపెనీ పంపిణీ చేసినట్లు సింగరేణి సంస్థ సీఎండీ తెలిపారు. దీపావళి బోనస్‌గా పిలవబడే పి.ఎల్.ఆర్.ఎస్. (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్) బోనస్‌ను నేటి నుంచి సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్య మంత్రి వర్యులు మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సచివాలయంలో ప్రకటించారు.
దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్‌ను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం.
రేపటి మధ్యాహ్నం నాటికి దీపావళి బోనస్ ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750 లు అందుకోనున్నారు.దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది. జే.బీ.సీ.సీ.ఐ. విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్ ను చెల్లించే పద్ధతి గత

మిగతా 2లో

## కొత్త రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోడీతో శంకుస్థాపన చేయిస్తాం



- జగన్ ఆస్తి వ్యవహారంపై చంద్రబాబు స్పందన
- చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని విమర్శలు
- ఇలాంటి వాడితో రాజకీయ పోరాటం చేస్తున్నందుకు సిగ్గుగా ఉంది: చంద్రబాబు
- ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉంటాడని ఊహించలేదని వెల్లడి

**అమరావతి:**అమరావతి రైల్వేలైనుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. రాజధానికి రైల్వే కనెక్టివిటీ వల్ల దేశంలోని అన్ని రాజధానులను అనుసంధానం చేసేందుకు వీలుగా కలుగుతుందనిఅభిప్రాయపడ్డారు.సీఎం చంద్రబాబు ఆన్ లైన్ లో కేంద్రం మంత్రులు అశ్వనీ వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురంధ్వేరితో మాట్లాడారు. (ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'అమరావతి రైల్వే లైన్ కు ఆమోదం తెలిపినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రిమండలికి ధన్యవాదాలు తెలుపుతున్నా. అమరావతికి ఈ రైల్వే లైను వేయడం వల్ల దేశంలోని అన్ని రాజధాని నగరాలకు అనుసంధానంగా ఉంటుంది. చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, కలకత్తా నగరాలను ఈ రైల్వేప్రాజెక్టు కలుపుతుంది. రూ. 2,245 కోట్లతో 57 కి.మీ. మేర చేపట్టనున్న ఈ ప్రాజెక్టును 3 ఏళ్లలో పూర్తి చేస్తే మరింత ఉపయోగపడుతుందని కోరుతున్నా. కృష్ణానదిపై నిర్మించే 3.2 కిమీ రైల్వే వంతెనను ఐకానిక్ బ్రిడ్జిగా మార్చాలని కోరుతున్నా. దేశంలోనే అమరావతి వేగంగా అభివృద్ధి చెందడంతో పాటు బెస్ట్ సిటీగా ఉంటుంది. రాజధాని నిర్మాణానికి కేంద్రం కూడా వివిధ మార్గాల్లో సాయం అందిస్తోంది.. ఈ లైను నిర్మాణంలో భాగంగా 25 లక్షల చెట్లను నాటడం ద్వారా కార్బన్ డై ఆక్సైడ్ నివారించవచ్చు. రాష్ట్రంలో రూ.72 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఎప్పటి నుండో పెండింగులో ఉన్న రైల్వే జోన్ సమస్యను కూడా పరిష్కరించుకున్నాం అని తెలిపారు.వచ్చే నెల లేదా డిసెంబరులో మంచి ముహూర్తం చూసి రైల్వే జోన్ కు ప్రధాని మోదీతో శంకుస్థాపన కూడా చేయిస్తాం. ఇతర రైల్వే స్టేషన్లలో కూడా ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్రం నుండి ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ కూడా తగిన సమయంలోనే అందిస్తాం.
10 రోజుల క్రితమే ఢిల్లీలో పర్యటించినప్పుడు అమరావతి రైల్వే కనెక్టివిటీ గురించి ప్రధాని మోదీతో మాట్లాడాను ఇంత తక్కువ సమయంలో కేబినెట్ ఆమోదించడం సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు పూర్తిస్థాయిలో సహకరిస్తాం.' అని


మిగతా 2లో

# ఎకరానికి 15 వేల రైతు సహాయం ఇస్తా అన్నారు

## పది నెలలు గడిచిపాయే పైసా ఇవ్వకపాయే

**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వానకాలం మరియు ఏసంగి పంటలకు 5 వేల చొప్పున రెండు సార్లు రైతు ఖాతాలో జమ అయ్యేవి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ హోదాలో 15 వేలు ఇస్తానని ప్రకటించి కాంగ్రెస్ పక్షాన ముఖ్యమంత్రి అయి పది నెలలు గడుస్తున్న ఒక్క పైసా కూడా రైతు ఖాతాలో జమ కాలేదు. నేను రైతు బిడ్డను రైతును రాజును చేస్తా అని చెప్పిన రేవంత్ రెడ్డి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తూ ఉందని ఇదిలా ఉంటే వాయిదాల మీద వాయిదాలు వేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నాడని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2 లక్షల 50వేల మంది రైతులు నష్టపోతున్నారని రైతులు మండిపడుతు న్నారు. రెండు లక్షల రుణమాఫీ పథకం టెక్నికల్ సమస్య వల్ల కొంతమంది రైతులకు రుణమాఫీ కాలేదని బుకా యిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మిగులు రైతులకు రుణమాఫీ చేస్తుందా లేదా అని అర్థం కాని అయోమయంలో రైతులు ఎదురుచూస్తున్నారు. అసలుకే దిక్కులేదు కొసరు వడ్డిస్తా అన్నట్టు వ్యవసాయం చేసే రైతులకే ఎగనామం పెట్టి కౌలు రైతు లకు భరోసా కల్పిస్తానన్నడం కాంగ్రెస్ పార్టీకే చెల్లుతుందని అన్నారు ఇదిలా ఉంటే రైతు భరోసా పై తుమ్మల నాగేశ్వరరావు ఖరీఫ్ సీజన్ కు రైతు భరోసా ఇవ్వడంలేదని కీలక ప్రకటన చేశారు దీంతో ఎప్పుడు ఏ నిర్ణయం ఎలా తీసుకుంటుందో కాంగ్రెస్ పార్టీలోని నాయకులు ఎవరికి తోచిన విధంగా వారు ప్రకటనలు చేస్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని రైతులకు స్పష్టమైన ప్రకటన చేసి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు నిన్న మొన్నటి వరకు రైతు భరోసా ఇస్తాం అని చెప్పి ఇప్పుడు చేతులెత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పై నమ్మకం కోల్పోయిన రైతులు పంట పొలాలలో ఉండాల్సిన రైతులు ధర్నాలు రాస్తా రోకోలు పేరుతో రోడ్లపై పోరాటాలు చేస్తుందని ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రావాల్సిన రుణమాఫీ రైతు భరోసా లను వెంటనే విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.





# సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపావళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా భట్టి ఆదేశాలిచ్చారు.

**బోనస్ తో కలిపి కార్మికులకు దాదాపు రూ.1250 కోట్ల చెల్లింపులు**

కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపాయలు అందాయి.

అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క కార్మికునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్ల రూపాయలను కంపెనీ చెల్లించింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ.93,450లు లభిస్తాయి. మొత్తమ్మీద ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ.1250 కోట్ల ను కంపెనీ చెల్లించింది.

ఈ విధంగా సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు.

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆదేశాలపై సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాటు చేయాలని ఆయన పర్సనల్ మరియు ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకోవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తగా వెచ్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కొత్త రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోడీతో శంకుస్థాపన చేయిస్తాం

అన్నారు. అమరావతి రైల్వే ప్రాజెక్ట్ ఏపీకి పెద్ద బూస్ట్ అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీ ప్రజల కలను కేంద్రం నెరవేర్చిందనీ అన్నారు.కాగా, పవన్ చొరవతో రైల్వేలైన్‌కు మోడీ ఆమోదం తెలిపారని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. అమరావతికి రైల్వే కనెక్టివిటీ ఇవ్వడానికి మేం సిద్ధంగా ఉన్నామన్నారు. దేశంలో అన్ని ప్రధాన నగరాలకు కనెక్టివిటీ ఉంటుందన్నారు. మచిలీపట్నం, కాకినాడ పోర్టులకు అనుసంధానం చేస్తామని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. పరిటాల వద్ద మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ వస్తుందని తెలిపారు. ఏపీలో 73 రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు

ఏపీకి ఇది చారిత్రాత్మక రోజు అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజధాని నుంచి ఏ ప్రాంతానికైనా అనుసంధానం కీలకమని తెలిపారు. 10 రోజుల సమయంలో కొత్త రైల్వే లైన్ ప్రతిపాదనలు కేంద్ర కేబినెట్ ముందుకు తెచ్చారని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు ఇవాళ మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ఆస్తి వ్యవహారంపై స్పందించారు. నీ మీద, అవినాశ్ మీద ఏమీ మాట్లాడకూడదా.... చెల్లికి ఆస్తి ఇవ్వడానికి ఇలాంటి కండిషన్ పెడతావా? అని మండిపడ్డారు. చిల్లర రాజకీయాలు చేసే ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉంటాడని ఊహించలేదని అన్నారు. ఛీ ఛీ... ఇలాంటి వాడితో రాజకీయ పోరాటం చేస్తున్నందుకు సిగ్గుగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తల్లి మీద కోర్టుకు వెళ్లింది నువ్వు... చెల్లిని రోడ్డు మీదికి లాగింది నువ్వు... ఇవన్నీ నువ్వు చేసి, డైవర్షన్ పాలిటిక్స్ అని మా మీద పడి ఏడుస్తున్నావు అంటూ విమర్శించారు. మీ కుటుంబ విషయాలతో మాకేంటి సంబంధం? అని ప్రశ్నించారు. భర్త సంపాదించిన ఆస్తిలో మొదటి హక్కు భార్యకు రాదా? మీ తల్లిని నువ్వు కోర్టుకు లాగి, అందుకు మేమే కారణమంటే ఎలా? అని చంద్రబాబు నిలదీశారు. విలువలు లేని రాజకీయం చేస్తూ, అందులో హీరోయిజం చూపించాలని జగన్ అనుకుంటున్నాడు... ఇలాంటి వాళ్లను ఆదర్శంగా తీసుకోవద్దని మీ పిల్లలకు చెప్పండి అని వ్యాఖ్యానించారు. ప్రపంచం ముందుకు పరిగెడుతోందని, ఇంకా ఈ విలువలు లేని మనుషుల గురించి మనం ఆలోచిస్తూ ఉండడం ఎందుకని చంద్రబాబు పేర్కొన్నారు. చిల్లర రాజకీయాలు తిండిపెట్టవని, చెత్త రాజకీయాలు ప్రజలను కాపాడవని అన్నారు. విలువలు లేని వ్యక్తులు సమాజానికి చేటు అని, ఇలాంటి చెత్త రాజకీయాలు చేసే వారిని ప్రజలు మర్చిపోవాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లలో తనను స్వేచ్ఛగా బయట తిరగనివ్వలేదని చంద్రబాబు ఆరోపించారు. "ఇప్పుడు నువ్వు స్వేచ్ఛగా తిరుగుతున్నావు కదా... నిన్నేమైనా నిలువరించామా మేము? నాకు చేతకాదనుకున్నావా? నాకు రాజకీయాలు తెలియవా? నిన్ను నిలువరించడం నాకు ఒక్క నిమిషం పని" అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## అంతరిక్ష యాత్రకు టికెట్లు రెడీ

ప్రయాణికులను తీసుకువెళతామని తెలిపింది. అంటే రాకెట్ భూ వాతావరణాన్ని దాటి, అంతరిక్షం దరిదాపుల వరకూ వెళ్లి వస్తుంది. వచ్చే నెలలో మరిన్ని టికెట్లు అందుబాటులోకి తీసుకురానున్నట్లు డీప్ బ్లూ ఏరోస్పేస్ తెలిపింది. ఇక చైనాలోని మరిన్ని కంపెనీలు స్పేస్ టూరిజం రంగంలోకి ప్రవేశించేందుకు ప్రణాళికలు ప్రకటించాయి. 2028 నాటికి స్పేస్ టూరిజం విమానాలను ప్రారంభించనున్నట్లు సీఏఎస్ తెలిపింది.

## కేటీఆర్‌పై నిప్పులు చెరిగిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అధికారం కోల్పోయాక ఆయన కావాలనే ప్రభుత్వంపై దూషణకు దిగుతున్నారని, కానీ అలాంటి వాటిని సహించేది లేదని హెచ్చరించారు. పదేళ్లు మంత్రిగా వెలగబెట్టిన కేటీఆర్ అధికారం కోల్పోయాక సభ్యత, సంస్కారం మరిచి మాట్లాడుతున్నారని, అలాగే మాట్లాడితే తగిన రీతిలో సమాధానం చెబుతామన్నారు. ముఖ్యమంత్రి కుర్చీని అవమానించేలా మాట్లాడవద్దన్నారు.ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని సీతక్క ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో అన్నదాతలను పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు దొంగ ఏడుపు ఏడుస్తున్నారని విమర్శించారు.

పంట రుణమాఫీ చేయని బీఆర్ఎస్‌ను ప్రజలు, రైతులు గత ఎన్నికల్లో ఘోరంగా ఓడించారన్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఏకకాలంలో రుణమాఫీ చేసిందన్నారు. రైతులకు ఉచిత ఎరువులు, సన్నాలకు రూ.500 బోనస్ వంటి హామీలను ఇచ్చి అమలు చేశామన్నారు.

పంట బీమా పథకం లేని ఏకైక రాష్ట్రంగా తెలంగాణను గత బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వడ్ల కొనుగోలుకు 7,248 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తమ ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు తాము వడ్డీ చెల్లించే పరిస్థితి వచ్చిందని సీతక్క వాపోయారు.

## దీపావళి బాణసంచా విక్రయించేవారు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి: జీహెచ్ఎంసీ కమిషనర్

**హైదరాబాద్ :**దీపావళికి బాణసంచా విక్రయించే దుకాణదారులు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో క్రాకర్స్ దుకాణాలు పెట్టేవారు లైసెన్స్ తీసుకోవాలన్నారు. రిటైల్ దుకాణాలకు రూ.11 వేలు, హోల్‌సేల్ దుకాణాలకు రూ.66 వేలు లైసెన్స్ ఫీజును నిర్ణయించినట్లు తెలిపారు. ఫుట్‌పాత్‌లు, జనావాసాల మధ్య బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు నిర్ణీత ఫీజును చెల్లించి జీహెచ్ఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందాలన్నారు.

తాత్కాలిక ట్రేడ్ ఐడెంటిఫికేషన్ నెంబర్ కోసం సిటిజన్ సర్వీస్ సెంటర్, జీహెచ్ఎంసీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వులను పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకుంటే తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.బాణసంచా స్టాల్స్‌కు ఏర్పాటు చేసే విద్యుత్‌కు సంబంధించి నాణ్యమైన పరికరాలు ఉపయోగించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే అందుకు దుకాణాల యజమానులే బాధ్యత వహించాలన్నారు. కాలనీలు, బస్తీలకు దూరంగా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. పెద్ద పెద్ద హాల్స్‌లో తగిన ఫైర్ సేఫ్టీతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# హైదరాబాద్ నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు.. కిషన్ రెడ్డి

**హైదరాబాద్ :** హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు మరిన్ని వందే భారత్ రైళ్లు నడపుతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా అయిదు వందే భారత్ రైళ్లు నడుస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ ఇవాళ తన చాంబర్ లో తెలంగాణ ఎంపీలతో సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో కిషన్ రెడ్డితో పాటు ఎంపీలు సురేష్ రెడ్డి, కావ్య, డీకే అరుణ, రఘునందన్ రావు లు పాల్గొన్నారు.సమావేశం అనంతరం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90శాతం రైల్వేలైన్ల విద్యుద్దీకరణ జరిగిందని తెలిపారు. అమృత్ పథకం కింద పలు రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నామన్నారు. వరంగల్లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్ ను పెంచామన్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ను రూ.720 కోట్లతో అధునికీకరణ చేస్తున్నట్లు వివరించారు కిషన్ రెడ్డి. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దీనికి రూ.650 కోట్లు అవసరమని చెప్పారు. ఘట్కేసర్ వరకు ప్రస్తుతం ఎంఎంటీఎస్ సర్వీసు ఉందని.. అక్కడి నుంచి యాదాద్రి వరకు విస్తరించాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకున్నా ఎంఎంటీఎస్ సర్వీసును పొడిగిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.

**ఈదులపల్లి స్టేషన్ ను అభివృద్ధి చేయండి..**

ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ మాట్లాడుతూ.. ఈదుల నాగులపల్లి స్టేషన్ ను అభివృద్ధి చేయాలని రైల్వే జీఎం ను కోరారు. కొల్లూరు, ఈదులు నాగులపల్లి రైల్వే బ్రిడ్జిని అభివృద్ధి చేయాలన్నారు. జర్నలిస్టులు, దివ్యాంగులకు రైల్వే పాస్ లను పునరుద్ధరించాలని కోరారు. మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేయాలన్నారు.ఘట్ కేసర్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్‌తో తెలంగాణ ఎంపీల సమావేశం అనంతరం రైల్ నిలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 90 శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ పూర్తయిందన్నారు.

వరంగల్‌లో రూ.650 కోట్లతో రైల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా దక్షిణ మధ్య రైల్వే బడ్జెట్‌ను పెంచినట్లు చెప్పారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 5 వందే భారత్ రైళ్లను ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. మరిన్ని రైళ్లను తీసుకువస్తామన్నారు.రూ.720 కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులను చేస్తున్నామని, వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి అవి పూర్తవుతాయని తెలిపారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించాలని నిర్ణయం తీసుకున్నామని, ఇందుకు రూ.650 కోట్లు అవసరం అవుతాయన్నారు. ప్రస్తుతం ఘట్‌కేసర్ వరకు ఎంఎంటీఎస్ రైలు సేవలు ఉన్నాయని, దీనిని యాదాద్రి వరకు విస్తరిస్తామన్నారు. తెలంగాణ ప్రభుత్వం సహకరించకపోయినా ఎంఎంటీఎస్ సేవలను పొడిగిస్తామన్నారు.

# కేంద్ర కేబినెట్‌లో ఏపీకి వరాలు..

**న్యూఢిల్లీ :** కేంద్ర కేబినెట్ లో ఏపీకి వరాలు కురిపించారు.. ప్రదాని మోడీ అధ్యక్షతన ఇవాళ ఢిల్లీలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.. ముఖ్యంగా అంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాజెక్ట్ లకు మోడీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.. అమరావతి రైల్వే లైన్ ను మంజూరు చేసింది. విజయవాడ, గుంటూరు, తెనాలి మార్గాన్ని అనుసందానిస్తూ అమరావతి రైల్వే లైన్ ను నిర్మించనున్నారు..దఇక ఎర్రుపాలెం కృష్ణా నదిపై రైలు వంతెన నిర్మించేందుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.. మొత్తం 3.2 కిలోమీటర్ల రైల్వే వంతెన తో పాటు 57 కిలోమీటర్ల రైల్వే లైన నిర్మాణ కోసం రెండు వేల 245 కోట్లు ఖర్చు చేయనున్నారు.. ఈ రైల్వే లైన్ ఏర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మించనున్నారు. ఈ రైల్వే లైన్‌తో దక్షిణ, మధ్య, ఉత్తర భారత్‌తో అనుసంధానం మరింత సులువు కానుంది.

అమరావతి స్తూపం, ఉండవల్లి గుహలు, అమరలింగేశ్వరస్వామి ఆలయం, ధ్యానబుద్ధ ప్రాజెక్టుకు వెళ్లే వారికి సులువైన మార్గంగా అభివృద్ధి చేయనున్నారు. మచిలీపట్నం, కృష్ణపట్నం, కాకినాడ పోర్టులను అనుసంధానిస్తూ ఈ రైల్వేలైన్ ఏర్పాటు కానుంది.ఏపీ, బిహార్ రాష్ట్రాలకు రెండు రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణానికి అంచనా వ్యయం మొత్తంగా రూ.6,798 కోట్లు. ఇందులో అమరావతి రైల్వే లైన్‌కు రూ.2,245 కోట్లు కాగా.. బిహార్‌లో రైల్వే లైన్‌కు రూ.4,553 కోట్లు కేటాయించింది.ఏపీలో కొత్త రైల్వే లైన్ అమరావతి మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు మధ్య ఏర్పాటు కానుంది.

అంతరిక్ష రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆధ్వర్యంలో రూ.1,000 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఫండ్ దాదాపు 40 స్టార్టప్‌లకు తోడ్పాటు అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు ఆత్మనిర్భర్ భారత్‌కు మరింత ప్రోత్సహం కల్పించేలా ఈ నిధి ఉపయోగపడనుంది.

బిహార్‌లో రూ.4,553 కోట్లతో నర్కతియాగంజ్-రక్సాల్-సీతామర్హి-దర్భంగాబీ సీతామర్హి-ముజఫర్‌పుర్ కారిడార్ డబ్లింగ్‌కు పనులు చేపట్టనున్నారు. మొత్తంగా 256 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టుతో ఉత్తరప్రదేశ్, ఉత్తర బిహార్‌లకు ప్రయోజనం చేకూరనుంది. నేపాల్ అంతర్జాతీయ సరిహద్దుకు సమాంతరంగా కొనసాగే ఈ రైల్వే లైన్.. కాఠ్‌మాండూ, జానక్‌పూర్, లుంబినీ మధ్య ఆహార ధాన్యాలు, ఎరువులు, సిమెంట్, కంటెయినర్లను వేగంగా తరలించేందుకు ప్రత్యామ్నాయంగా ఉండనుంది.ఏపీ, బిహార్‌లలో చేపట్టే ఈ ప్రాజెక్టులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. అలాగే అన్ని ప్రదాన రైళ్లు అమరవతి మీదుగా ప్రయాణించేలా చర్యలు చేపడుతున్నారు.. ఇక ఈ కేబినేట్ లో వచ్చే నెల ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలపై చర్చించారు.. ఈ సెషన్లో ప్రవేశ పెట్టనున్న కొన్ని బిల్లుకు కేబినేట్ ఆమోద ముద్ర వేసింది.

# ట్రకోమాను తరిమికొట్టిన భారత్

ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) భారత ప్రభుత్వానికి కండ్లకు సంబంధించిన వ్యాధి ట్రకోమాను నిర్మూలించిన దేశంగా గుర్తింపును ఇచ్చింది. కాగా డబ్ల్యూహెచ్‌వో 2021 2030 మధ్య కాలంలో అంతగా పట్టించుకోని ఉష్ణమండల వ్యాధుల (నెగ్లెక్టెడ్ ట్రాపికల్ డిసీజెస్) రోడ్‌మ్యాప్‌లో నిర్మూలించాల్సిన వ్యాధుల్లో ట్రకోమా కూడా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ట్రకోమా పుట్టుపూర్వోత్తరాలు..కండ్లకు బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే అంటువ్యాధి ట్రకోమా. ఇది క్లామ్డీడియం ట్రకోమేటిస్ అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. కండ్లకు సోకే ఇన్ఫెక్షన్ కారణంగా అంధత్వానికి దారితీసే వ్యాధుల్లో ట్రకోమా ప్రధానమైంది. ముఖ్యంగా ఈ వ్యాధి అపరిశుభ్ర వాతావరణం, స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేని పేదరికంలో మగ్గే ప్రాంతాల్లో ప్రబలంగా కనిపిస్తుంది. ఇన్ఫెక్షన్‌కు గురైన వ్యక్తుల కండ్లు, ముక్కు నుంచి కారే ద్రవాలను నేరుగా తాకడం వల్ల ట్రకోమా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. అంతేకాకుండా ఈ ద్రవాలను తాకిన ఈగల వల్ల కూడా ట్రకోమా సోకుతుంది. కండ్ల కలక (కంజంక్టివైటిస్ లేదా పింక్ ఐ)తో ట్రకోమా మొదలవుతుంది. చికిత్స తీసుకోకపోతే ఇన్ఫెక్షన్ లోపలి కంటిపాపపై పుండుకు కారణమవుతుంది. ఇది ట్రైకియాసిస్‌కు దారితీస్తుంది. కంటి రెప్పలు లోపలికి ముడుచుకుపోయి కార్నియాతో ఒరుసుకుం



టాయి. దీంతో నొప్పి కలుగుతుంది. కంటిచూపును దెబ్బతీసి చివరికి అంధత్వాన్ని కలిగిస్తాయి. ట్రకోమాను తొలిదశలోనే గుర్తిస్తే ఎజిత్రోమైసిన్ లాంటి యాంటి బయాటిక్స్‌తో నివారించ వచ్చు. పరిశుభ్రమైన నీళ్లు తాగడం, శుభ్రత పాటించడంతో ట్రకోమా రాకుండా నివారించవచ్చు. కాగా, దక్షిణాసియాలో ట్రకో మాను నిర్మూలించిన నాలుగో దేశంగా భారత్ నిలిచింది. నేపాల్, మయాన్మర్, పాకిస్తాన్ ఇప్పటికే ఈ లక్ష్యాన్ని సాధించాయి.

# అంతరాష్ట్ర పోలీసు అధికారుల భేటీ

అంకిత్ పాండ్యా హాజరై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు.చత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీస్ అధికారులతో మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కదలికలు లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాష్ట్రాల సరిహద్దుల్లో ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు, ఫేర్రి పాయింట్ల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే రామగుండం కమిషనరేట్ పోలీసులు మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న మూడు లక్షల రూపాయల విలువ గల 300 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు.రామగుండం సిపి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్టులు 24 గంటల పాటు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నదితీర ప్రాంతాల్లో నిఘా పెంచాలని, మావోయిస్టుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నుండి ఆసిఫాబాద్, భూపాలపల్లి ఎస్పీ లతో పాటు మంచిర్యాల డీసీపీ పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఖన్నా

**న్యూఢిల్లీ :** భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియామకానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఆమోదముద్ర వేశారు. సంజీవ్ ఖన్నా నవంబర్ 11న సీజేఐగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్ వాల్ వెల్లడించారు.ప్రస్తుత సీజేఐ డీవై చంద్రచూడ్ పదవీ కాలం నవంబర్ 10న ముగియనుంది. దీంతో జస్టిస్ ఖన్నా పేరును చంద్రచూడ్ సిఫార్సు చేయగా... రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. దీంతో వచ్చే నెల 11వ తేదీన సుప్రీంకోర్టు 51వ సీజేఐగా జస్టిస్ ఖన్నా బాధ్యతలు స్వీకరించనున్నారు.జస్టిస్ సంజీవ్ ఖన్నా 2025 మే 13వ తేదీ వరకు సీజేఐగా కొనసాగుతారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. తీస్‌హజారీ జిల్లా కోర్టు, హైకోర్టు, ట్రైబ్యునళ్లలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2005లో ఢిల్లీ హైకోర్టులో అదనపు జడ్జిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

# వ్యాక్సిన్ కోసం వచ్చిన తల్లీబిడ్డలు అదృశ్యం




**బంజారాహిల్స్,అక్టోబర్ 24:** హాస్పిటల్‌లో కుమార్తెకు వ్యాక్సిన్ వేయించేందుకు వచ్చిన వివాహిత తన కుమార్తెతో కలిసి అదృశ్యమైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌కు చెందిన కాజా ఇలియాజ్ అహ్మద్ అనే వ్యక్తి ఈనెల 21న సోదరి నిషా ఫిర్‌దౌస్‌తో కలిసి ఆమె నాలుగేళ్ల కుమార్తెకు వ్యాక్సిన్ వేయించేందుకు బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. సోదరి నిషా ఫిర్‌దౌస్‌ను, ఆమె కుమార్తెను గేటు వద్ద దింపిన ఇలియాజ్ కారు పార్కింగ్ చేసేందుకు సెల్లార్‌లోకి వెళ్లాడు.

కాసేపటికి కారు పార్క్ చేసి వచ్చిన తర్వాత సోదరి నుంచి తాను వాష్‌రూమ్‌లో ఉన్నానంటూ మెసేజ్ వచ్చింది. దాంతో ఆమె కోసం వేచి ఉండగా ఎంతసేపటికి తిరిగిరాకపోవడంతో హాస్పిటల్ మొత్తం గాలించాడు.దాంతో తెలిసిన వారికి ఫోన్లు చేయడంతో పాటు అన్ని చోట్లా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బుధవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రోటీన్లు కావాలంటే రోజూ వీటిని తింటే సరిపోతుంది..!



మనం ఆరోగ్యంగా ఉండాలంటే అన్ని రకాల పోషకాలు ఉండే ఆహారాలను రోజూ తినాలన్న విషయం అందరికీ తెలిసిందే. పోషకాల విషయానికి వస్తే వాటిల్లో ప్రోటీన్లు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ప్రోటీన్ల వల్ల కణాలకు మరమ్మత్తు జరుగుతుంది.

కొత్త కణాలు ఏర్పడేందుకు ప్రోటీన్లు సహకరిస్తాయి. కనుక ప్రోటీన్లను మనం రోజూ తగినంత మోతాదులో తినాలి. 18 ఏళ్లకు పైబడిన వారికి రోజుకు కనీసం 30 గ్రాముల మేర ప్రోటీన్లు కావాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రోటీన్ల విషయానికి వస్తే చాలా మందికి నాన్‌వెజ్ ఆహారాలు గుర్తుకు వస్తాయి.

**వెజ్ ఫుడ్స్‌లోనూ ప్రోటీన్లు ఉంటాయి..**

ప్రోటీన్లు అంటే కేవలం నాన్ వెజ్ ఆహారాల్లోనే ఉంటాయని అనుకుంటారు. కోడిగుడ్లతోపాటు చికెన్, మటన్, ప్రాన్స్, చేపలు వంటి వాటిల్లో ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయని భావిస్తారు. అయితే అది నిజమే అయినా ప్రోటీన్ల కోసం రోజూ నాన్ వెజ్ తినలేరు కదా. అందుకని వెజ్ ఆహారాలను కూడా తినాలి. ఇక వెజ్ ఆహారాల విషయానికి వస్తే పలు ఫుడ్స్‌లోనూ మనకు ప్రోటీన్లు లభిస్తాయి. వాటిల్లో పనీర్ ముఖ్యమైందని చెప్పవచ్చు. పాలను విరగ్గొట్టి తయారు చేసే పనీర్‌లో ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. నాన్ వెజ్ తినలేని వారు తరచూ పనీర్‌ను ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అలాగే సోయాబీన్‌తో తయారు చేసే తోఫులోనూ ప్రోటీన్లు సమృద్ధిగానే ఉంటాయి.

**పిస్తాను తినాలి..**

తోఫు మన శరీరానికి తప్పనిసరిగా కావల్సిన 9 అమైనో ఆమ్లాలను కలిగి ఉంటుంది. అలాగే తోఫులో ఐరన్, క్యాల్షియం కూడా ఎక్కువగానే ఉంటాయి. అందువల్ల తోఫు లేదా పనీర్‌ను తింటే గుండె జబ్బులు, కీళ్ల జబ్బులు వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. ఈ వ్యాధులు ఉన్న వారు వీటిని తప్పనిసరిగా తినాలి. అదేవిధంగా పిస్తా పప్పులోనూ ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. రోజూ గుప్పెడు పప్పు తింటే ఎన్నో ప్రోటీన్లను పొందవచ్చు. పిస్తాను ఉదయం బ్రేక్‌ఫాస్ట్ లేదా సాయంత్రం స్నాక్స్ రూపంలో తినవచ్చు. నానబెట్టి తింటే మంచిది. సులభంగా జీర్ణం అవుతాయి. పిస్తా పప్పులో మనకు ఉపయోగపడే ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి కాబట్టి వీటిని రోజూ తినాలి.

**పప్పు దినుసుల్లోనూ..**

పెసలు, బొబ్బర్లు, రాజ్మా వంటి పప్పు దినుసులను చాలా మంది తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ ఈ పప్పు ధాన్యాల్లో ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. చికెన్, మటన్ తినలేని వారు తరచూ ఈ పప్పులను తినవచ్చు. ఒక కప్పు పప్పు ధాన్యాల ద్వారా మనకు 18 గ్రాముల మేర ప్రోటీన్ లభిస్తుంది. ఇది దాదాపుగా 100 గ్రాముల మాంసం ద్వారా లభించే ప్రోటీన్లకు సమానం అని చెప్పవచ్చు. అందుకని పప్పు ధాన్యాలను తరచూ తింటుండాలి. దీంతో ప్రోటీన్లు లభిస్తాయి. కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. కణాలు నిర్మాణం అవుతాయి. అలాగే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు.

# బెహరాన్ లో వెంపేట్ వాసి మృతి



**మెట్ పల్లి రూరల్ ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**బతుకు తెరువు కోసం రెండున్నర సంవత్సరాల నుండి మారంపెల్లి సుధీర్ ( 34 ) భేహారన్ కు వలస వెళ్లి జీవిస్తున్నాడు, సుధీర్ కు అప్పుల బాధలు ఎక్కువ కావడంతో బుధవారం రాత్రి బేహారాన్ లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు,మృతుడి కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా బాడి తొందరగా ఇండియాకు వచ్చే విదంగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వడి నర్సింగరావు దృష్టికి తీసుకువెళ్తానని, సుధీర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) అక్టోబర్ 24 :** గురువారం కలెక్టరేట్ సమావేశామందిరంలో ప్రసిద్ధ దేవాలయాలు,చారిత్రాత్మక కట్టడాలు, పర్యాటక రంగ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ఆమెకు వివరించారు. ఆమె మాట్లాడుతూ పర్యాటక రంగంగా అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను గుర్తించి అవసరమైన సౌకర్యాలు సుందరీ కరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# జిల్లాలో పర్యటించిన రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్

## కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు ఆఫీస్ సందర్శన



**ఆదిలాబాద్ ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈసందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు.స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.క్యాంపు ఆఫీస్ చాలా బాగుందన్నారు.నియోజక వర్గంలో కంది శ్రీనివాస రెడ్డి చేస్తున్న సామాజిక సేవాకార్యక్రమాలు తెలుసుకుని మెచ్చుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లైబ్రరీలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయాలు అభివృద్ధి చెంది పాఠకులకు మరిన్ని మెరుగైన సేవలందిస్తాయన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,లోక ప్రవీణ్ రెడ్డి,ఎం.ఏ షకీల్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని,కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్,బండారి సతీష్,ఆవుల వెంకన్న,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్ గౌడ్,ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు రంగినేని శాంతన్ రావు,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి,నాయకులు సింగిరెడ్డి రామ్ రెడ్డి,పోరెడ్డి కిషన్,బూర్ల శంకరయ్య,ఎం.ఏ ఖయ్యుమ్,సాత్విక్ రెడ్డి,అశోక్,సంద రమాకాంత్,శ్రీనివాస్,షౌకత్ అలీ,షేక్ ఖలీం,వసంత్ పవర్ తదితరులు పాల్గొన్నారు.

# రాధాకృష్ణుల సేవాభాగ్యం

రాధాకృష్ణులు వేర్వేరు కాదని, శ్రీకృష్ణుని అంతర్గత శక్తియైన 'హ్లాదినీ శక్తి' స్వరూపమే ఆమె అని 'శ్రీ చైతన్య చరితామృతం' వెల్లడించింది. సుమారు 5,000 సంవత్సరాల కిందట భగవంతుడు భూమ్మీద అవతరించి తన లీలలను ప్రదర్శించినప్పుడు రాధారాణి కూడా ఆవిర్భవించింది. ఒకనాడు వృషభాను మహారాజు యమునా నదీతీరాన స్నానానికి వెళ్లాడు. నదిలో ఒక బంగారు పద్మం తేలియాడుతూ వేయి సూర్యుల కాంతితో ప్రకాశిస్తూ కనిపించింది. వెంటనే నదిలోకి దిగి దాని దగ్గరకు వెళ్లగా, అందులో ఎంతో అందమైన, ప్రకాశవంతమైన ఒక పాపను చూశాడు. ఆ పాపను ఇంటికి తీసుకువచ్చి తన భార్యయైన కీర్తిదకు చూపించగా, ఆమె పరమానందభరితురాలైంది. సంతానం లేని ఆ దంపతులు ఆ పాప ను అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. కానీ, ఆ పాప ఎన్ని రోజులైనా కళ్లు తెరువకపోవటంతో వారు చాలా బాధపడ్డారు. నారదముని సలహాతో ఆమె పుట్టినరోజు సంబురాలను ఎంతో ఘనంగా ఏర్పాటుచేశారు. ఆ వేడుకలకు ఆహ్వానం పొందిన నందమహారాజు దంపతులు కూడా కృష్ణబలరాములతో కూడివచ్చారు. అప్పుడు చిన్ని కృష్ణుడు నేల మీద పాకుతూ ఆ ఉయ్యాల దగ్గరికి వెళ్లి రాధారాణిని చూడటంతోనే ఆమె కళ్ళు తెరిచింది. ఆమె తదేకంగా శ్రీ కృష్ణుడినే కొంచెం సేపు చూస్తుండి పోయింది. రాధారాణి కళ్ళు తెరుచుకోవడంతో వృషభాను, కీర్తిద దంపతుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అక్కడున్న వారంతా అది చూసి ఆనందపరవశులయ్యారు.పద్మపురాణం, పాతాళకాండలో శ్రీమతి రాధారాణి సర్వోన్నత శ్రేష్ఠ స్థానాన్ని గురించిన వివరాలున్నాయి. రాధారాణి శ్రీ కృష్ణునకు అత్యంత ప్రియతమురాలు. 'రాధాకుండం' అనే కొలను కూడా అత్యంత ప్రియమైంది. గోపికల్లో రాధయే శ్రీ కృష్ణునకు పరమ ప్రియురాలు. రాధారాణియే శ్రీకృష్ణుని పట్టమహిషి అని కూడా 'బృహత్ గౌతమీయ తంత్రం' పేర్కొన్నది. దివ్య దేవతా స్వరూపిణి అయిన రాధారాణి శ్రీకృష్ణుని అర్ధాంగి. లక్ష్ములలో ఆమెయే ప్రధానురాలు. సర్వాకర్షకుడైన భగవానుని ఆకర్షించే సమస్తాకర్షణలూ ఆమెలో ఉన్నాయి. ఆమెయే దేవదేవుని ఆది అంతరంగశక్తి. శ్రీ మద్భాగవతంలో శ్రీ శుక మునీంద్రులవారు 'రాధ' అనే నామాన్ని ప్రస్తావించిన వైనం 'దశమస్కంధం'లో (10.30.28) చూస్తాం.

# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

## - కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు



**మెట్ పల్లి / జగిత్యాల ( మన వెలుగు ) అక్టోబర్ 24 :** గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసిందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ సర్కార్ పదేండ్ల పాటు అధికారంలోకి ఉండి గల్ఫ్ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని అన్నారు. ఎంతోమంది గల్ఫ్ కార్మికులు విదేశాల్లో గత పది సంవత్సరాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. గత పది సంవత్సరాల్లో ఎంతోమంది గల్ఫ్ కార్మికులు ఇక్కడి నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోయారని, అయినప్పటికీ వాటిపైన గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి ఈ సందర్భంగా ముందడుగు వేసిందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గల్ఫ్ కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం





## - జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**పోలీస్ ఫ్లాగ్ డే, పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌజ్ కార్యక్రమాన్ని ఉద్ధ్యేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.... పోలీస్ శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై, పోలీస్ శాఖ పనితీరు, వివిధ అంశాలపై విధ్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించాలనే ఉదేశ్యంతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు విద్యతో సమాజంలో జరుగుతున్న పరిణామాల పై అవగహన పెంచుకోవాలని అన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ అంటే ఏమిటి, అది ప్రజలకు శాంతి భద్రతల విషయంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది, దాని ఫంక్షన్నింగ్ ఏవిధంగా ఉంటుందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అందు కోసం స్టాల్స్ ను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం ద్వారా ప్రజలకు దగ్గర అవుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం డే, నైట్ బీట్స్, పెట్రోలింగ్ వ్యవస్థలు ఏవిధంగా పనిచేస్తాయి.పోలీసు శాఖ నేరస్తులను సులువుగా గుర్తించడం కోసం అభివృద్ధి చేసిన ఫేస్ రికగ్నిషన్ సిస్టం, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి నూతన సాంకేతికతల గురించి వివరించారు. నేరాలు జరగకుండా నివారించడంలో మరియు జరిగిన నేరాన్ని త్వరగా చేదించడం లో సి.సి కెమెరాలు ఏవిధంగా ఉపయోగపడతాయి.మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ఏర్పాటయిన షీ టీమ్ లు, భరోసా సెంటర్ ఏవిధంగా పని చేస్తాయి. పోలీస్ శాఖ ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, ఏ సందర్భాలలో ఉపయోగపడతాయి అని వివరించడం జరిగింది.బాంబ్ స్క్వాడ్స్ ఏవిదంగా బాంబులను నిర్వృత్తి చేస్తుంది.సైబర్ నేరాలగురించి ఏవిధంగా అప్రమత్తంగా వుండాలి, ఆన్లైన్ లో అపరిచితులతో పరిచేయాలకు దూరంగా ఉండాలని, ఏదైనా సైబర్ క్రైమ్ కు గురి అయినట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు కాల్ చేసి మీ యొక్క ఫిర్యాదు నమోదు చేయాలని వివరించడం జరిగింది. అర్మోరర్లు, బాంబ్ స్క్వాడ్ టీం, ఐటి కోర్ , భరోసా సిబ్బంది, షిటీమ్, ఫింగర్ ప్రింట్స్, కమ్యూనికేషన్ సిబ్బంది విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరును వివరించ డం జరిగింది. ఈ కార్యక్రమాలలో అడిషనల్ ఎస్పీ భీం రావ్, డిఎస్పీ రఘు చందర్, ఆర్.ఐ లు కిరణ్ కుమార్, రామక్రిష్ణ వేణు, ఐటి కోర్,డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్,రఫిక్ ఖాన్, ఫింగర్ ప్రింట్స్ ఇన్స్పెక్టర్ రాజు, ఆర్ఎస్ఐ లు విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే జగపతిరావు విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

## -మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన నాయకులు



**కరీంనగర్ ( మన వెలుగు ) అక్టోబర్ 24 :** ప్రముఖ తెలంగాణ ఉద్యమకారులు, సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ ఎమ్మెల్యే దివంగత వెలిచాల జగపతిరావు విగ్రహం ఏర్పాటు కోసం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థలం కేటాయించి అనుమతి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పాయ్ కి గురువారం నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సరిల్ల రతన్ రాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దివంగత నేత జగపతి రావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించి అనుమతి ఇవ్వాలని కోరారు. కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా తాము మీ ప్రతిపాదన తమరికి సమర్పిస్తున్నామని వివరించారు , వెలిచాల జగపతి రావు 1972 నుంచి 1977 వరకు జగిత్యాల నియోజకవర్గం నుండి శాసన సభ్యులుగా, మరియు 1978 నుండి 1984 వరకు శాసనమండలి సభ్యులుగా పనిచేశారని తెలిపారు.1989 నుండి 1994 వరకు కరీంనగర్ నియోజకవర్గం నుంచి మరోసారి శాసనసభ్యుడిగా పనిచేశారని వివరించారు. ఆయన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా ఎంతో మంచి పేరు సంపాదించారని పేర్కొన్నారు. కరీంనగర్ ప్రజలు ఆయన్ను ప్రజాబంధుగా గౌరవించారని, పేదల కోసం నిరంతరం హరితపించిన మహా నేత జగపతిరావు అని వివరించారు. కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. ఆయన అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజల అభివృద్ధికి ఎంతో దోహదపడ్డాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏదేని యోగ్యమైన ప్రదేశంలో కరీంనగర్ ప్రజలకు అత్యుత్తమ సేవలందించిన మహా నాయకులు జగపతిరావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మున్సిపల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గండి రాజేశ్వర్, మాజీ నగర ప్రధాన కార్యదర్శి సరిళ్ళ రతన్ రాజు, కాంగ్రెస్

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ పై అవగాహన



**జగిత్యాల ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం లో నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బందికి ఐరన్ డెఫిషియన్సీ డిజార్డర్స్ కంట్రోల్ పైన అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎండి సమీయుద్దీన్ మాట్లాడుతూ మనం తినే ఆహారంలో ప్రతిరోజు ఐదు గ్రాముల అయోడైసిడ్ సాల్ట్ ఉండేటట్లు చూసుకోవాలని లేనిచో వాటి వలన చాలా దుష్ప్రభావాలకు లోను కావాల్సి ఉంటుందని సూచించా రు. ప్రోగ్రాం ఆఫీసర్ ఫర్ ఎన్ సి డి డాక్టర్ అర్చన మాట్లాడుతూ.. అయోడిన్ లోపం వలన గర్భస్రావం, మృత శిశు జననం , అసంపూర్ణ పిండ మెదడు అభివృద్ధి , తక్కువ మానసిక మరియు శారీరక పెరుగుదల, గాయిటర్ , తక్కువ ప్రజ్ఞ లబ్ధి స్థాయి అనగా బుద్ధి మాంద్యత, మరుగుజ్జు తనం మరియు తక్కువ అభ్యసన సామర్థ్యాలు వస్తాయని అందుకే తప్పనిసరిగా ఆహారం లో అయోడిన్ వాడవలనని సూచించారు.అయోడిన్ థైరాయిడ్ గ్రంథిలో కీలకంగా వ్యవహరించి టి3,టి4 మరియు థైరాయిడ్ స్టిములేటింగ్ హార్మోన్ లను స్రవించడంలో తోడ్పాటు అందిస్తున్నామని,కావున ప్రజలందరూ అవగాహన పెంచుకొని అయోడిన్ లోపం వలన కలిగే దుష్ప్రభావాల నుండి కాపాడుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఎండి సమీయుద్దీన్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అర్చన వైద్యులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.


# నవంబరు 6 లోపు పట్టబద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

## - బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ



**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటుహక్కు వినియో గించుకునేందుకు నవంబర్ ఆరో తేదీలోగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ పట్టభద్రులను కోరారు, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబా ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. 2021 నాటికి లేదా అంతకు ముందు పట్టభద్రులై ఉన్నవారు. వచ్చే నెల నవంబర్ 6 వరకు పట్టభద్రులు ఓటరునమోదుచేసుకోవాలనుకునే వారు అప్లికేషన్ తో పాటు వారి ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులకు అందజేస్తే వారే ఆన్లైన్ లో ఎన్రోల్ చేసి, సర్టిఫికెట్లు సబ్మిట్ చేస్తారని ముసిపట్ల లక్ష్మినారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టభద్రులు అందరూ వినియోగించుకోవాలని కోరారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో లక్షలాదిమంది పట్టభద్రులు ఉన్నప్పటికీ గత ఎన్నికల్లో వరకు 1.97 లక్షల మంది మాత్రమే ఓటర్లుగా తమ పేరును నమోదు చేయించు కున్నారని అన్నారు. గత ఎన్నికల్లో 1.07 లక్షల మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారని తెలిపారు. అదే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదై, మెజారిటీ సంఖ్యలో ఓటు హక్కువినియోగించుకుంటారని అన్నారు. గతంలో నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు అండగా నిలిచి ప్రభుత్వా నికి, పట్టభద్రులకు వారధిగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కు గంగాధర్, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బి.సి మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజ, నియోజకవర్గ అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి, పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, యూత్ కో-ఆర్డినేటర్ హృషికేష్,బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంసార వృక్షఫలం మోక్షమే!భగవంతుడు



ఈ శరీరాన్ని ఎందుకిచ్చాడనే అసహనంతో ప్రశ్నించేవాళ్లు చాలామంది ఉంటారు. ఈ శరీరం అనేది లేకపోతే ఏ కష్టాలూ ఉండవని వారి తలంపు. అటువంటి వారికి శరీరం విలువ తెలియదనే చెప్పాలి. జన్మలలో మానవజన్మ ఉత్తమమైంది. నిజానికి భగవంతుడు జీవులను ఉద్దేశించి 'మీకే జన్మ కావాలని' అడిగితే ఆయనను 'మానవజన్మ ఇమ్మని' కోరుతాం. ఆశ్చర్యం ఏమంటే, భగవంతుడు మొదట మానవుడినే సృష్టించినట్లు వేదాది గ్రంథాలు చెబుతున్నాయి. 'యః ఈశే అస్య ద్విపదః చతుష్పదః (23-3)' అన్నది యజుర్వేదం. రెండు పాదాలుగల ఉత్తమజన్మ మానవజన్మే. ఆ తర్వాతనే నాలుగు పాదాలు, అంతకంటే ఎక్కువ పాదాలుగల జన్మలు కలిగాయి. జీవకోటికి సుఖదుఃఖాలు అనుభవించడానికే సృష్టి ఉద్దేశితమైంది. మానవ శరీరం సృష్ట్యాదిలో భగవంతుని కరుణతో అయాచితంగా లభించిందే. బుద్ధిమంతులైన మానవులు సృష్టిగతమైన ఈ రహస్యాన్ని తెలుసుకొని వ్యవహరిస్తారు. మానవ శరీరం ఎంతో పుణ్యం చేస్తేగాని లభించదని మనందరికీ తెలుసు. కానీ, మొదట అయాచితంగా భగవంతుడు దాన్ని మనకు ఇచ్చిన విషయమే మన గ్రహింపులోకి రాదు. భగవంతుడే సృష్టికర్త. అతడు యజుర్వేదంలో (స ఓతశ్చ ప్రోతశ్చ విభూః ప్రజాసు. 32-8) చెప్పినట్లు అన్నింటిలోను ఓత ప్రోతమై ఉన్నాడు. ఇక్కడ 'అన్ని' అంటే సర్వ పదార్థాలని భావించాలి. మరి, సృష్టికంటే ముందు 'అతడొక్కడే ఉన్నాడా? అతనిలో ఏమీ లేవా?' అనే ప్రశ్న కలుగుతుంది. దానికి సమాధానం 'ఛాందోగ్యోపనిషత్తు'లో ఉంది. 'సదేవ సౌమ్యేదం అగ్ర ఆసీదేక మేవా ద్వితీయమ్' (6-2-1). సృష్టికంటే ముందు భగవంతుడు ఒక్కడే ఉన్నాడు. అతడు అద్వితీయుడు అనే విషయం 'సత్' పదం వల్ల తెలుస్తున్నది. భగవంతుడు సూక్ష్మ పదార్థాలలోకెల్లా సూక్ష్మమైనవాడు. కనుకనే అంతటా వ్యాపించి ఉన్నాడు. పరమాణువులు సూక్ష్మమైనవి. అవి జ్ఞానం లేనివి. జీవులు వాటికంటే సూక్ష్మమైనవి. అవి జానం కలిగినవి. పరమాణువులకంటే, జీవులకంటేకూడ సూక్ష్మమైనవాడు భగవంతుడు. 'ముండకోపనిషత్తు' దీనిని ధ్రువపరుస్తున్నది. 'సూక్ష్మాచ్చ సూక్ష్మాతరం విభాతి' (3-1-7). సూక్ష్మమైన ప్రకృతిని నామరూప జగత్తుగా మార్చినవాడు భగవంతుడే. శరీరధారియైన జీవునికే రూపం, నామం లభిస్తాయి. నిజానికి జీవుడు అణువుకంటే సూక్ష్మమైనవాడు కనుక, అతనికి రూపం లేదు. శరీరంలోకి ప్రవేశించేంత వరకు పేరుకూడా లేదు. ఆత్మజ్ఞానం లేకపోవడం వల్ల తానే శరీరంగా భావించినప్పుడు, శరీరసుఖం కోసం కర్మలు చేస్తూ జన్మలు ఎత్తుతుంటాడు మానవుడు. కానీ, ఈ పాంచభౌతికమైన శరీరంలో తాను ఉన్నట్లు, దానికంటే భిన్నమైనట్లు, దాన్ని వదులుకోవడమే శ్రేయస్కరమైనట్లు ఎప్పుడైతే భావిస్తాడో అప్పుడు మానవుడు పురుషార్థాలపట్ల దృష్టి పెడతాడు. 'శరీరమాధ్యం ఖలు ధర్మసాధనమ్' అనే సూక్తిని ఆకళింపు చేసుకొని ధర్మకార్యాలే తలపెడతాడు. పరోపకార కర్మలకే ప్రాధాన్యమిస్తూ, యథోచితంగా లభించిన సంపదతో జీవితాన్ని కొనసాగిస్తూ, సుఖాలను అనుభవిస్తూ పరమ పురుషార్థమైన మోక్షం వైపు సాగుతాడు. మనం ఎప్పుడైతే నిష్కామబుద్ధితో కర్మలు చేస్తామో అప్పుడే ప్రకృతి బంధనాలనుంచి బయటపడగలుగుతాం. కర్మనే మనల్ని బంధిస్తుంది. అదే తిరిగి మనలను మోక్షం వైపు మళ్లిస్తుంది. 'కర్మ వై చిత్ర్యాత్ సృష్టి వైచిత్ర్యమ్' (సాంఖ్యం? 6-46). కర్మ వైచిత్రివల్లే ఈ విచిత్రమైన సృష్టి రచన జరిగింది. ఎప్పుడైతే కర్మబంధనాల నుంచి మనకు విముక్తి లభిస్తుందో, అప్పుడే విశ్రాంతి లభిస్తుంది. నదులు ప్రవహిస్తూ సముద్రాన్ని చేరి నామరూపాలు విడిచి కనిపించకుండా పోయినట్లుగా, జ్ఞానికూడా నామరూపాలను విడిచి, పరాత్పరుడైన భగవంతున్ని చేరుకొంటాడు. ఇది నిష్కామకర్మ యోగం వల్ల మాత్రమే సాధ్యమవుతుంది. అటువంటి యోగి తన యోగాగ్నిలో కర్మలను దగ్ధం చేసుకోగలుగుతాడు. సంసార బంధనాలనుంచి బయటపడి మోక్షస్థితిని చేరుకొంటాడు.

### రామాయణంలో కైకేయి తన భర్త (దశరథుడు)ను కోరరాని వరాలు కోరడం న్యాయమేనా? తన కొడుకు (భరతుడు) మనసు తెలుసుకోకుండా స్వార్థబుద్ధిని చూపడం ఎంతవరకు ధర్మం?



రామాయణం ఆత్మ ప్రధాన కావ్యం. రాముడు సాక్షాత్తు శ్రీమహా విష్ణువు. ఈ అప్రమేయ తత్త్వాన్ని మానవులు తెలుసుకునేందుకే 'కైకేయి పాత్ర' చక్కగా ఉపయోగపడింది. కైకేయి చేసిన 'రామ పట్టాభిషేక భంగం' అనేది పైకి తప్పు వలె కనిపించినా అది లోక శ్రేయస్సుకు జరిగిన మహోపకారంగానే భావించాలి. ఈ విషయం శ్రీరామునికీ తెలుసు కనుకనే చిన్నమ్మను తప్పు పట్టలేదు. ఇంకా, ఎక్కువగానే గౌరవించాడు. మంథరకూడా దేవతలతో ప్రేరేపితమైందే. దీని వెనుక 'రావణాసుర వధ' అనే ఒక బృహత్ కార్యం దాగి వుంది. ఇది జరగాలంటే, రాముడు అయోధ్యను విడిచి వెళ్లక తప్పదు. ఇంతేకాదు, దట్టమైన అడవులున్న అయోధ్య పరిసర ప్రాంత ప్రజలు ఆటు క్రూరమృగాలతోనూ, ఇటు రాక్షసులతోనూ పీడింపబడుతూ వున్నారు. 'దుష్ట శిక్షణ- శిష్ట రక్షణ'కు రామ వనవాసం అనివార్యం. అసలు, 'కైకేయి వరాలు' కోరక పోతే రామాయణ కావ్యమే లేదు. అయోధ్య నుండి రాముడు బయటకు వెళ్లడానికి బలమైన కారణంగా 'కైకేయి ఉదంతాన్ని' పేర్కొనాలి. ఆమెకూ తెలుసు 'రాముడు తన తండ్రి మాట కాదనడని'. అందుకే, అలాంటి కోరరాని వరాలనే కోరింది. దాని వెనుక ఒక మాతృహృదయాన్ని చూపించడం గ్రంథకర్త గొప్పతనం. ఎంతమంది చెప్పినా కైకేయి తన పట్టుదల వదలలేదు. 'నువ్వు వరాన్ని ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని' దశరథుడిని బెదిరించింది కూడా. తల్లిని వారించే శక్తి ఒక్క భరతుడికి మాత్రమే ఉంది. కానీ, ఆ సమయంలో అతను మేనమామల దగ్గర ఉన్నాడు. వరాలు, శాపాలు మానవ ప్రవృత్తికి సంబంధించినవే. అవి అన్నీ కర్మ సిద్ధాంతాన్ని అనుసరించే పుట్టాయన్నదీ గమనార్హం.

# రాష్ట్రంలో గాడితప్పిన విద్యారంగం




**- పెండింగ్ స్కాలర్షిప్ ఫీజు రివర్స్మెంట్ విడుదల చేయాలి**

**- సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంచేంత వరకు పోరాటాలు చేస్తాం**

**-ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్**

**నల్గొండ ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**హాలియా. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో గాడితప్పిన విద్యారంగం మార్పు రావాలి కాంగ్రెస్ రావాలని గోప్ప ఉపన్యాసాలు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గర ఉన్న విద్యాశాఖ నే సరైన మార్గం లో నడవకుంటే మిగతా శాఖల పని ఏవిధంగా వుంటుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రివర్స్మెంట్ విడుదల చేయకపోతే పేద మధ్యతరగతి విద్యార్థులు పై చదువులు ఎలా సాధ్యమన్నారు అలాగే స్ సి స్ టీ, బి సి, మైనార్టీ గురుకుల పాఠశాలలకు స్వంత భవనాలు నిర్మించాలని అన్నారు.రాష్ట్రంవ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంచాలి డిమాండ్ చేశారు.ఇప్పటి వరకు హాస్టల్ విద్యార్థులకు గత బిఆర్ యస్ ప్రభుత్వం అందించి మెనూ మాత్రమే అందిస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో, గురుకులాలు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించకుండా నాస్తికమైన బియ్యాన్ని అందిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.హత్యలు అత్యాచారాలు దాడులు దౌర్జన్యాలు చేసిన ఖైదీ లకు 87రూపాయలతో భోజనం అందిస్తుంది ప్రభుత్వం ఈ దేశానికి కాబోయే బావి భారత పౌరులకు రోజుకు33రూపాయాలతో మూడు పూటలా భోజనం ఏవిధంగా సాధ్యమో రాష్ట్ర ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో ఉండే విద్యార్థులు 3వ తరగతి నుండి 8వ తరగతి విద్యార్థులకు 950రూపాయాలు8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు 1050రూపాయాలు ఇంటర్ డిగ్రీ పిజి కళాశాల విద్యార్థులకు 1500రూపాయాలతో మూడు పూటలా భోజనం ఏవిధంగా సాధ్యం అవుతుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు, మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతామనేసి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు చెప్తున్నా నీటికి జీవో కాఫీ విడుదల చేయకపోవడం దీనికి నిదర్శనం అన్నారు తక్షణమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులు అర్థాకలితో అలమటిం చకుండా వుండాలన్నా పేద విద్యార్థుల చదువులు ముందు కు పోవాలంటే వేంటనే మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంచాలి, బకాయిలో ఉన్న స్కాలర్షిప్ ని తక్షణమే విడుదల చేయాలి అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగంపైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సాధించాలని నిద్ర పోతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేలూ కోల్పొందుకు రేపటినుండి రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఆందోళన కార్యక్రమం చేస్తామని తెలియ జేశారు విద్యార్థులతో చెలగాటం ఆడితే ఈ ప్రభుత్వానికి గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించా రు.విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బ్రతికి బట్ట కట్ట లేదన్న చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్ కోరే రమేష్ చందు సాయి వర్షిత్ నాగరాజు అనిల్ మనోజ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాల పురిటిగడ్డ కొమరం భీమ్ స్ఫూర్తితో ముద్దుకు పోతాం





## రామన్న చేపట్టిన పోరుబాటనే ఇక ఉద్యమ బాటగా ముందుకు పోతాం

**ఆదిలాబాద్ ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగానికి సైతం వెనకాడని కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీ రామరక్షా అని బీ.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం చేయకుండా అసమర్థ పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా కోసం అన్నదాతలకు అండగా తలపెట్టిన పోరుబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని రాం లీలా మైదానంలో నిర్వహించిన పోరుబాట సభలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నేతలు తీవ్రంగా ఖండించారు. ముందుగా సభకు హాజరైన కేటిఆర్ కు పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా నీరజనాలు అందుకున్న ఆయనకు ఘన స్వాగతాలు లభించాయి. వేదికపైకి వచ్చిన తర్వాత నేతలు శాలువలు, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించి అభిమానాన్ని చాటారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగురామన్న తన ప్రసంగంతో శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఆయన... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసమర్థ పాలన పట్ల స్థానికంగా మాట్లాడే బాషలో సేటైర్లు వేసి ఆకట్టుకున్నారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదేలేదంటూ స్పష్టం చేశారు. రైతాంగానికి, సామాన్య ప్రజానికానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అండగా ఉంటామని స్పష్టం చేయడంతో సభికుల నుండి హర్ష ధ్వానాలు వినిపించాయి. అనంతరం %న్‌టీ% ప్రసంగించి ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. ఈ మేరకు బీ.ఆర్.ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ..... రాష్ట్రంలో అడుగడుగునా అశాంతి, అభద్రత నెలకొందని, డిచ్ పల్లిలో పొలిసు కుటుంబీకులు ధర్నాలు చేయడం పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. ప్రజల కోసం ప్రశ్నిస్తున్న తమపై కేసులు పెడుతున్నారన్న ఆయన... ఎన్ని రోజులు జైల్లో ఉండడానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. అధికారులు, పొలిసు యంత్రాంగం న్యాయం కోసం పని చేయాలనీ, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు. మితిమీరి ప్రవర్తించిన వారికి తాము అధికారంలోకి వచ్చాక మిత్తితో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. పేదలకు నష్టం చేస్తున్న ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, పేదలని కూడా చూడకుండా కేసుల పేరిట బెదిరించడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. ఉద్యమాలు పురిటిగడ్డ లాంటి ఆదిలాబాద్ లో పోరుబాట కు శ్రీకారం పడిందని, ఇదే బాటలో నడుస్తూ రైతుల పక్షాన పోరాడతామని పేర్కొన్నారు. ముక్రా గ్రామస్తులు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై రాహుల్ గాంధీ కి పోస్టు కార్డులను పంపి ప్రశ్నించారని, పోస్ట్ కార్డు ఉద్యమాన్ని గ్రామగ్రామాన చేపట్టాలని పిలుపునిచ్చారు. తెలంగన ఉద్యమ సమయంలో భోరజ్ చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన ధర్నా రోజులను గుర్తుకు తెచ్చిన కేటీఆర్ ప్రస్తుతం అదే స్ఫూర్తితో అసమర్థ ప్రభుత్వంపై పోరాడతామని తెలపడంతో సభికులు చప్పట్లతో మారుమోగించారు. అదాని వంటి కార్పోరేట్లకు ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కెసిఆర్ ఉంటె వారి ఆటలు సాగేవి కాదన్నారు. ఆదిలాబాద్ లో పండించే పత్తికి గుజరాత్ కంటే తక్కువ ధర చెల్లించడం భావ్యం కాదని, పత్తి ధరపై ఇక్కడి బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. భారత రాష్ట్ర సమితి... భారత రైతు సమితిగా పోరాటాలు చేస్తుందని, రైతులెవరూ అధైర్య పడే అవసరం లేదని భరోసా కల్పించారు. సభకు పెద్ద ఎత్తున హాజరైన రైతులు, ప్రజలను చూసి జిల్లా నాయకత్వం పనితీరు పట్ల ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ విధానాలపై పోరాటానికి జిల్లా తోవ చూపిందని, అదే బాటలో నడుస్తామని పునరుద్ఘాటించారు.సమావేశంలో ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ లతో పట్టణ అధ్యక్షులు అజయ్, మైనార్టీ నాయకులు సజీతోద్దీన్, యూనిస్ అక్బాని, మహిళా నాయకులు చారులత, స్వరూప రాణి బుడగం మమత, ప్రేమల,పాటు ఉమ్మడి జిల్లా నేతలు, పలువురు రాష్ట నాయకులు

# గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి





**అసాంఘిక కార్యకలాపాలకు నివారించడానికి ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి**

**వార్షిక తనిఖీల్లో భాగంగా బీర్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ**

**బీర్పూర్ పోలీస్ స్టేషన్ అధికారుల, సిబ్బంది పనితీరు భేష్**



**జగిత్యాల ప్రతినిధి ( మన వెలుగు ) అక్టోబర్ 24 :**ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. గురువారం వార్షిక తనిఖీలో భాగంగా బీర్పూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని,బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చని అన్నారు. పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ కార్ మరియు బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికీ 10 నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు,సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి, మరియు పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ ల పరిధిలోని కేసుల నమోదు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ0లో 5ఎస్ అమలు చేసిన తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వారి యొక్క డ్యూటీ ల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5%వా% విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్నివిభాగాలు తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బీర్పూర్ ఎస్.ఐ కుమారస్వామి మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ఒంటి చేత్తో దేశాలను పాలిస్తున్న మహిళా నాయకులు వీళ్లే..!

తొమ్మిది నెలలలో ఓ బిడ్డకు ప్రాణంపోయగల శక్తి స్త్రీకి ఉంది. కానీ, చట్టసభలలో ఆమె ప్రాతినిధ్యానికి ఉద్దేశించిన బిల్లు మాత్రం మూడు దశాబ్దాలు గడిచినా చట్టరూపం దాల్చలేదు. మొత్తానికి గ్రహణం వీడింది. లోక్‌సభ ఆమోదం పొందింది. అయినా, మహిళ పాలన మనకు కొత్తేం కాదు. తరాలుగా తన నాయకత్వ ప్రతిభను నిరూపించుకుంటూనే ఉన్నదామె. స్వాతంత్ర్యం తర్వాత ఏర్పడిన మొట్టమొదటి క్యాబినెట్‌లో మంత్రిగా కొలువైన అమృత కౌర్ నుంచి ఇప్పటి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వరకు చాలామంది మగువలు దేశానికి ప్రాతినిధ్యంవహించారు. ఇక విశ్వ మహిళలు ఇందిరాగాంధీ, మార్గరెట్ థాచర్, అంగ్‌సాన్ సూకీ, బెనజీర్ భుట్టో తమదైన ముద్రతో అంతర్జాతీయ సమాజాన్ని ప్రభావితం చేశారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళా దేశాధ్యక్షులను కూడా తలుచుకుని తీరాలి.
%పాకిస్తాన్ నుంచి విడివడిన దేశం. ఛాందసం ఒకవైపు, మిలటరీ ప్రాబల్యం మరోవైపు.. అధికార పీఠం పీకనొక్కే ప్రయత్నం చేస్తున్న సందర్భం. ఈ సవాళ్లను తట్టుకుంటూనే 15 ఏళ్లుగా బంగ్లాదేశ్‌ను పాలిస్తున్న షేక్ హసీనాను తల్చుకుంటే చాలు, మహిళల నాయకత్వ సామర్థ్యం పట్ల మన అనుమానాలన్నీ పటాపంచలైపోతాయి. మిలటరీ తిరుగుబాటులో బంగ్లాదేశ్ జాతిపితగా భావించే తండ్రి ముజిబుర్ రెహమాన్‌ను, తల్లిని, కొడుకును, ముగ్గురు సోదరులను కోల్పోయింది. అయినా నిబ్బరంగా రాజకీయాల్లోకి దిగి, తండ్రి వారసత్వాన్ని చాటుకున్నది. తిరుగుబాట్లను తట్టుకుని తిరుగులేని నాయకురాలిగా నిలిచింది. ఆమెకు దీటుగా నిలిచింది కూడా మరో మహిళే.. ఖలీదా జియా! సమర్థ ప్రధానిగా దేశాన్ని గాడిన పెడుతున్నారు హసీనా.

**తాయ్ ఇంగ్ వెన్**

తైవాన్.. ఒక అతిచిన్న దేశం. ప్రచ్ఛన్న యుద్ధంలో, ప్రపంచశక్తుల అహంకారంతో నలిగిపోయిన ప్రాంతం. అయినా ఆ సంక్షోభాల మధ్య నిలదొక్కుకోవడమే కాకుండా ధనిక దేశంగా మారింది. ఈ మార్పును విశ్లేషకులు 'తైవాన్ మిరకిల్' గా పేర్కొంటారు. పక్కనే ఉన్న చైనా ఎప్పుడెప్పుడు తైవాన్‌ను ఆక్రమిద్దామా అని ఎదురుచూస్తూ ఉంటుంది. ఓ పసికూన ప్రపంచశక్తిని ఎదుర్కొని నిలబడి, ముందుకు సాగడం వెనుక ఆ దేశాధ్యక్షురాలు తాయ్ ఇంగ్ వెన్ ఉన్నారు. ఆమె తండ్రి ఓ ఆటో షాప్ యజమాని. తొమ్మిది మంది పిల్లల మధ్య సాధారణ జీవితం గడిపింది. అంచెలంచెలుగా ఎదుగుతూ, ఈ స్థాయికి చేరుకున్నది. దేశ అభివృద్ధిని వేగవంతం చేస్తూ, చైనా కవ్వింపులను నేర్పుగా ఎదుర్కొంటూ, అంతర్జాతీయ సమాజంతో సత్సంబంధాలు కొనసాగిస్తూ%ా% ప్రపంచంలోని ప్రతిభావంతులైన నాయకుల జాబితాలో చోటు సంపాదించుకున్నది. వారసత్వంతోనే మహిళలు రాజకీయాల్లో విజయం సాధిస్తారనే అపోహను పటాపంచలు చేసింది.

**ఎలిజబెత్ బోన్**

ప్రపంచ యుద్ధం తర్వాత ఫ్రాన్స్ కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. కొవిడ్ దెబ్బకైతే, నిలదొక్కుకోలేకపోయింది. ఈ విలాసదేశాన్ని ఇప్పుడు పేదరికం, నిరుద్యోగం అవహించాయి. ఈ నేపథ్యంలో దేశ ప్రధాని పదవిని చేపట్టిన ఎలిజబెత్ మీదే అందరి ఆశలూ! ఎలిజబెత్‌కు పదకొండేండ్లు ఉన్నప్పుడు.. ఆమె తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ సంరక్షణలో పెరిగింది ఎలిజబెత్. బాగా చదువుకుని ప్రభుత్వ అధికారిగా పాలనకు దగ్గరైంది.
ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఐదేళ్లలోనే ప్రధాని పదవి చేపట్టింది. పరిపాలన దక్షతతో.. దేశపరిస్థితులను చక్కదిద్దుతూనే, మైనారిటీ ప్రభుత్వాన్ని నెట్టుకొస్తున్నది. మహిళా నాయకులు ఆర్థిక, రాజకీయ సంక్షోభాల్ని నిలువరించలేరనేవాదనను కొట్టిపారేస్తున్నది ఎలిజబెత్.

**జార్జియా మెలోని**

2022లో ఫోర్బ్స్ పత్రిక 'ప్రపంచంలోనే అత్యంత శక్తివంతులైన మహిళలు' పేరుతో ఓ జాబితాను విడుదల చేసింది. అందులో తొలి పది స్థానాల్లో చోటు దక్కించుకున్న ఏకైక ప్రధాని జార్జియా మెలోని. ఇటలీ నేత. మహిళలు రాజకీయాల్లోకి అనుకోకుండా వస్తారే కానీ, ఆ రంగాన్ని ఉద్దేశపూర్వకంగా ఎంచుకోరు అనే అభిప్రాయాన్ని కొట్టిపారేసే కెరీర్ తనది. కౌమారం నుంచే ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటున్నది. 2022లో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. 'ఎవరిని నేతగా ఎంచుకోవాలి?' అనే విషయం మీద రోజుల తరబడి తర్జనభర్జన కొనసాగింది. దాన్ని దాటుకుని ప్రధాని పీఠాన్ని అందుకున్నది జార్జియా. కొవిడ్, అక్రమ వలసలు, డ్రగ్స్ లాంటి సమస్యల పట్ల కఠినమైన వైఖరి ప్రదర్శించింది. భారత్ సహా ఎన్నో దేశాలతో మంచి సంబంధాలు కొనసాగించింది. ఇటలీ తొలి మహిళా ప్రధాని కూడా జార్జియానే!

**ఆనా బ్రన్‌బిక్**

ఓ చిన్న దేశం. ప్రపంచ రాజకీయాలను ఎదుర్కొని ముందుకు సాగడమే కష్టం. అందులోనూ చుట్టూ ఎన్నో వివాదాలు. ఇదీ సెర్బియా పరిస్థితి. వేల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ దేశం తన సరిహద్దుల్లోని కొసావా, బోస్నియా సమస్యలతో నలిగిపోతున్నది. వాటికి తోడు అటు అమెరికా, ఇటు రష్యా.. ఈ రెండూ కూడా సెర్బియా తమకే మద్దతు ఇవ్వాలని ఆశిస్తుంటాయి. ఇక కొవిడ్ ఓ కొత్త తలపోటు. ఈ నేపథ్యంలో తొలి మహిళా ప్రధానిగా గెలిచారు ఆనా.



అంతేకాదు! స్వలింగ సంపర్కురాలిగా ప్రకటించుకొన్న అతికొద్ది మంది నాయకులలో తనూ ఒకరు. 2017లో పదవిని చేపట్టిన ఆనా ఎన్నో సంక్షోభాల నుంచి దేశాన్ని గట్టెక్కించారు. పార్టీ చేతిలో కీలుబొమ్మ అని ఎగతాళి చేసినా.. వ్యక్తిగతంగా, పాలనాపరంగా లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు.

**సాహ్లె వర్క్ జూడ్**

ఆఫ్రికా.. ఆదిమ మానవుడి పుట్టిల్లు అని చెబుతారు. కానీ ఆధునిక ప్రపంచంలో నిలదొక్కుకోలేకపోయింది. అణచివేత, బానిసత్వంతో చీకటి ఖండంగా మారింది. పేదరికం, నిరక్షరాస్యత లాంటి సమస్యలు ఎలాగూ ఉన్నాయి. వాటికి తోడు అనేక అంతర్గత అలజడులు ఆఫ్రికా దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. అలాంటి ఓ గడ్డ.. ఇథియోపియా. ఆ దేశ అధ్యక్షురాలు వర్క్ జూడ్. 35 ఏళ్ల క్రితం రాయబారిగా మొదలైన ఆమె రాజకీయ ప్రయాణం, 2018లో ఆ దేశ తొలి మహిళా అధ్యక్షురాలి స్థాయికి చేరుకుంది. నిర్ణయాల విషయంలో ఎంత కఠినంగా ఉంటుందో, మానవతలో అంత ఉదారంగా వ్యవహరిస్తుందని సాహ్లెకు పేరు. వేల మంది ఖైదీలకు క్షమాభిక్ష పెట్టడమే ఇందుకు ఉదాహరణ. 'మహిళల గురించి నేను మరీ ఎక్కువగా మాట్లాడుతున్నా అనుకుంటున్నారేమో ఇది ఆరంభం మాత్రమే' అంటూ తన ఆశయాన్ని స్పష్టం చేస్తారు వర్క్ జూడ్.

**ఆరంభమే..**

.. వీళ్లు మాత్రమే కాదు. ఐస్‌లాండ్, డెన్మార్క్, జార్జియా, స్లొవేకియా, గ్రీస్, టాంజానియా, హంగెరీ లాంటి దేశాలకూ మహిళలే సారథ్యం వహిస్తున్నారు. పాలనలో ఎవరికీ తీసిపోమని నిరూపిస్తున్నారు. పౌరులను కన్నబిడ్డల్లా తీర్చిదిద్దగలమని, దేశాన్ని ఇంటిలా చక్కదిద్దగలమని చేతల్లో చాటుతున్నారు ఈ నారీ నేతలు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఈ నమ్మకానికి కొనసాగింపు.

# మూగ బంధం







రోడ్డుమీద ఏ ప్రమాదమో జరిగి, తోటి మనుషులకు రక్తమోడుతున్నా తమదారిన తాము వెళ్లే రోజులివి. ఇక, జంతువులకు దిక్కెవరు? మహ్మద్ సుమ మాత్రం.. ఎక్కడ ఏ మూగ జీవికి ఇబ్బంది కలిగినా వెంటనే బయల్దేరి వచ్చేస్తారు. ఎక్కడ ఏ వన్యప్రాణిని అంగడి సరుకులా విక్రయిస్తున్నారని సమాచారం అందినా.. క్షణాల్లో వాలిపోతారు. నోరులేని జీవాలకు బాసటగా నిలుస్తారు. అధికారుల సహకారంతో అక్రమారుల ఆట కట్టిస్తారు.
మహబూబాబాద్‌లోని జగన్ కాలనీ సుమ చిరునామా. కన్నవారు మహ్మద్ సుభాని, సలీమ. ఇద్దరూ సమాజ సేవకులే. 'సృష్టిలోని ప్రతి ప్రాణికి మనిషితో సమానంగా జీవించే హక్కు ఉందని, వాటి స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒకరిదని నా తల్లిదండ్రులు తరచూ చెప్పేవారు. ఆ మాటలే నన్ను ఇటువైపు నడిపించాయి' అంటారామె. దిక్కులేని పిల్లికూనలు, గాలిపటం మాంజా తగిలి రెకలు విరిగిన రామ చిలుకలు, కుకల బారినపడిన గుడ్ల గూబలు, విద్యుదాఘాతానికి గురైన పావురాలు, రోడ్డు ప్రమాదంలో నడుము విరిగిన ఆవులు.. ఇలా ప్రమాదంలో ఉన్న ప్రతి జీవీ ఆమెకు ఆత్మబంధువే. పశు వైద్యుల సాయంతో చికిత్స అందించడంతో పాటు అవి పూర్తిగా కోలుకునే వరకూ ఆశ్రయం ఇస్తారు.
వన్యప్రాణుల విక్రయాలను నిలువరించి అక్రమారులను అటవీశాఖ అధికారులకు అప్పజెప్పిన సందర్భాలూ అనేకం. విదేశీ వలస పక్షులను, జల్మా జాతి పక్షులను, నక్షత్ర తాబేళ్లను కాపాడి వరంగల్ నగరంలోని వన విజ్ఞాన కేంద్రానికి తరలించిన ఘటనలూ ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సంచార పశు వైద్యశాల(1962) గురించీ విస్తృతంగా ప్రచారం చేస్తారు సుమ. ఆ చొరవలో భాగంగా మండల పరిధిలోని 21 గ్రామాలలో పాదయాత్ర చేపట్టారు. సుమ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవంనాడు ఘనంగా సన్మానించింది.

# హిందీ చందనం!

పిల్లల కోసం పెద్దలు కథలు రాయడం ఎంత కష్టమో. పిల్లల కోసం పెద్దలు ఆ కథలు చదవడం కూడా అంతే కష్టం. అయితే, ఇష్టం ఉంటే ఏదీ కష్టం కాదని అంటున్నారు గజ్వేల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయిని డాక్టర్ సిరిసిల్ల చందన. పిల్లల పాఠాల కోసం కథలు చదువుతూ.. చివరికి ఆ కథలపైనే పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారామె. హిందీ బాలసాహిత్యంపై తెలంగాణలో జరిగిన తొలి పరిశోధన ఇది. సాధనమున పనులు సమకూరు ధరలోన అన్న మాటను నిజం చేసిన చందన కథ ఇది..చిన్నప్పటి నుంచీ సాహిత్యం అంటే ఇష్టం. హిందీ కథల పుస్తకాలు, కామిక్స్ బాగా చదివేదాన్ని. నాన్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో వారెంట్ ఆఫీసర్‌గా పని చేసేవారు. తరచూ ట్రాన్స్‌ఫర్స్ ఉండేవి. బదిలీ ఉత్తర్వులు వచ్చిన ప్రతిసారీ ఊళ్లు మారేవాళ్లం. ఎంత దూరంలో ఉన్నా సరే.. తరచూ మా సొంతూరు సిరిసిల్లకు వచ్చేవాళ్లం. దీంతో రైలు ప్రయాణాలు ఎక్కువగా ఉండేవి. అదీ రెండుమూడు రోజుల సుదీర్ఘ యాత్రలే. రైల్వే స్టేషన్‌కు వెళ్లగానే నాన్న మమ్మల్ని బుక్ స్టాల్‌కు తీసుకుపోయేవారు. నాకు, అన్నయ్యకు, తమ్ముడికి ఇష్టమైన కామిక్ బుక్స్ కొనిచ్చేవారు. అలా మా రైలు ప్రయాణం.. చందమామ, విక్రమ్ బేతాళ్, సూపర్ మ్యాన్ సిరీస్, సరిత, ఫెమినా తదితర పత్రికలతో హుషారుగా సాగిపోయేది.

**హిందీ ప్రేమ..**

బెంగళూరులోని కేంద్రీయ విద్యాలయలో చదువుతున్నప్పుడు హిందీ టీచర్ ప్రేమా సింగ్‌తో మంచి అనుబంధం ఉండేది. ఆమె పాఠం చెప్పే విధానం బాగా నచ్చేది. పద్యాలను, శ్లోకాలను చక్కగా విశ్లేషించేవారు. ఆ స్ఫూర్తితో ప్రాచీన కావ్యాలు, ప్రేమ్‌చంద్ నవలలు, కథలు చదివాను. హిందీ భాష, సాహిత్యం మీద అభిమానం పెంచుకున్నాను. ఆ ప్రేమ



కాలేజి రోజుల్లో ఇంకా పెరిగింది. బీఏలో హిందీ లిటరేచర్ తీసుకున్నాను. చాలా మంది హిందీలో పాస్ మార్కులు వస్తే చాలనే ధోరణితో ఉంటారు. దీంతో హిందీ టీచర్‌కు ప్రాధాన్యం తగ్గింది. హైస్కూల్‌లో అయిదేళ్లు చదివినా హిందీలో మాట్లాడలేరు. దీనికి మన విద్యా విధానంలోని లోపాలే కారణం. టీచర్లు ఎంతసేపూ భాషను సాహిత్యంతో జోడించి చెబుతున్నారు. ఇంతకు మించి వాళ్లకు అదనపు మెటీరియల్ దొరకట్లేదు. అందువల్లే పిల్లలకు హిందీ నేర్పలేకపోతున్నారు. విద్యార్థులూ నేర్చుకోలేకపోతున్నారు. అందుకు భిన్నంగా మా తరగతి గదిలో కొన్ని ప్రయోగాలు చేశాను. రోజూ పాఠం అయిపోయాక విద్యార్థులతో హిందీలో మాట్లాడిస్తాను. వచ్చినా రాకున్నా కచ్చితంగా మాట్లాడాలి. అలా అయితేనే భాష వస్తుందని వాళ్లను ప్రోత్సహిస్తాను. 'సాటర్‌డే.. ఫన్‌డే' పేరుతో పిల్లలతో చిన్న చిన్న నాటికలు వాటిలోని సంభాషణలు వాళ్ల భాషా సామర్థ్యాన్ని పెంచుతాయి. విద్యార్థులతో నీతికథలు చెప్పిస్తాను. మధ్యలో ఏవైనా తెలుగు పదాలు వాడితే హిందీ పదాలు గుర్తు చేస్తాను. పుట్టిన రోజున చాక్లెట్లు కాకుండా పిల్లల కథల పుస్తకాలు తెమ్మని చెప్తాను. తరగతి గదిలో ఒక దండెం కట్టి, ఆ పుస్తకాలను వేలాడదీస్తాను. పిల్లలు తమకు ఇష్టమైన పుస్తకాన్ని తీసుకుని చదువుకోవచ్చు. నేను పిల్లలకే కాదు టీచర్లకూ పాఠాలు చెప్పాను. ఎన్‌సీఈఆర్‌టీ నేషనల్ రిసోర్స్ పర్సన్‌గా హిందీ టీచర్లకు వీడియో, ఆడియో ఎడిటింగ్, పవర్‌పాయింట్ ట్కస్లైడ్ ప్రజెంటేషన్, డిజిటల్ కంటెంట్ రూపకల్పన గురించి నేర్పించాను. ఎస్‌సీఈఆర్‌టీకి కూడా హిందీ రీసోర్స్ పర్సన్‌గా ఉన్నాను. టీ శాట్ కోసం 25 హిందీ పాఠాలు (డిజిటల్) రూపొందించాను.

**పిల్లల్లా చదివా..**

మధ్యలో ఆగిపోయిన చదువును కొనసాగిస్తూ.. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఎంఏ (హిందీ), ఎంఫిల్ పూర్తిచేసి 2018లో పీహెచ్‌డీలో చేరాను. ఆ సమయంలో నేను ఓ విద్యార్థిగా మారిపోయాను. కె. శ్యాంసుందర్ గారు నాకు గైడ్. హిందీ బాలసాహిత్యానికి సంబంధించిన తెలంగాణలో ఏ పరిశోధనా జరగలేదు. నాదే మొదటి ప్రయత్నం. నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) ప్రచురించిన హిందీ బాలసాహిత్యం గురించి నేను పరిశోధన చేశాను. ఇందులో ఎన్‌బీటీ హిందీ బాలసాహిత్య వర్గీకరణ, వివిధ దశలను విశ్లేషించడంతోపాటు పిల్లల ఆలోచనల్లో, సృజనాత్మకతలో వచ్చిన మార్పుల్ని కూడా చర్చించాను.

# అక్షర అర్చన!





శిథిల స్థితిలో నిర్మాణాలు.తాగునీరు లేని తరగతి గదులు. విరిగిన బెంచీలు. ముక్కలైపోయిన కుర్చీలు. పిడికెడు మంది విద్యార్థులు. ఇదంతా ఆమె బాధ్యత తీసుకోవడానికి ముందు మాట. అర్చన నోగూరి ప్రధానోపాధ్యాయురాలి హోదాలో కాలుపెట్టగానే పరిస్థితుల్లో మార్పు వచ్చింది. కొద్దికాలంలోనే అత్యుత్తమ పాఠశాల స్థాయికి చేరింది ఆ సర్కారు బడి. ఆ చొరవకు గుర్తింపుగానే ఆమె జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.'పాఠశాల సమాజానికి దూరంగా ఉండొద్దు. సమాజంలో ఓ భాగం కావాలి. అంతెందుకు? ప్రభుత్వ పాఠశాలల కోసం సర్కారు చాలా చేస్తున్నది. ఉచితంగా పుస్తకాలు ఇస్తున్నది. మధ్యాహ్న భోజనంలో పోషకాహారం అందిస్తున్నది. యూనిఫామ్ సమకూరుస్తున్నది. టీచర్లు కూడా ఎంతోకొంత చేయగలిగితేనే పిల్లలు అన్ని రకాలుగా ఎదుగుతారు'.. ఇప్పుడే కాదు. విద్యార్థి దశ నుంచీ బోధన రంగం మీద నా నిశ్చితాభిప్రాయం ఇది. ఇరవై మూడేండ్ల క్రితం.. నా కల నిజమైంది. ఏరికోరి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నాను. చాలా పాఠశాలల్లో పనిచేశాను. పదేండ్ల క్రితం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెన పల్లి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలిగా వచ్చాను.
రెండు వేల జనాభా ఉన్న పెద్ద గ్రామం అది. కానీ, పాఠశాలలో 30 మంది విద్యార్థులే ఉన్నారు. దాదాపు మూతపడే స్థితిలో ఉంది. ఒక బడి తలుపులు మూసుకుంటే.. వందల జీవితాలు చీకటి పాలవుతాయి. ఏ విద్యాలయానికీ ఆ దుస్థితి రాకూడదు. ఎలాగైనా మా పాఠశాలను బతికించుకోవాలని నిర్ణయించుకున్నా. ఇక్కడ ఇంగ్లిష్ మీడియం లేకపోవడంతో చాలామంది తమ పిల్లల్ని ప్రైవేటు పాఠశాలకు పంపేవారు. ఇంటింటికీ తిరిగి కన్నవారితో మాట్లాడాను. టీచర్లు లేరు, తాగునీటి వసతి లేదు, కనీసం ఇంగ్లిష్ మీడియం ఉన్నా పంపేవాళ్లం.. ఇలా రకరకాల కారణాలు చెప్పారు. గ్రామసభ నిర్వహించి అందరి సహకారం కోరాను. సానుకూల స్పందన వచ్చింది. ఆ భరోసాతో బడి సమీపంలోని ఎస్సీ కాలనీలో ప్రతి కుటుంబాన్నీ కలిశాను. ఆర్థిక భారంతో పిల్లలను చదివించలేకపోతున్న తల్లిదండ్రులతో మాట్లాడి 25 మంది పిల్లల్ని చేర్చుకున్నాను.

**పట్టుదలతో మెప్పించి..**

రోజూ అందరికంటే ముందు నేనే బడికి వెళ్లేదాన్ని. లెక్కలు రాని పిల్లలకు లెక్కలు నేర్పేదాన్ని. తెలుగులో వెనుకబడినవారికి చదవడం, రాయడం అలవాటు చేయించాను. ఆ ఏడాది విద్యార్థుల్లో వచ్చిన మార్పును అంతా గమనించారు. దీంతో రెండో ఏడాది 90 మంది పిల్లలు వచ్చారు. ఆ తర్వాత, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మా పాఠశాల పూర్తిస్థాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌గా మారింది. దీంతో పక్కనున్న ఎల్లారం గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పాతిక మందిని చేర్పించారు. వాళ్లను చూసి ముత్యంపేట, చింతపల్లి, దండేపల్లి, వెంకటాపూర్ నుంచీ పిల్లలు వచ్చారు. అయితే, విద్యార్థుల సంఖ్య పెరిగాక కూడా తాగునీటి వసతి ఉండేది కాదు. తరగతి గదులూ అంతంతమాత్రమే. సర్పంచ్ చొరవ తీసుకుని.. పాడైపోయిన రెండు గదులను బాగు చేయించారు.
అప్పటి ఎమ్మెల్సీ రూ.1.10 లక్షలతో బోరు వేయించారు. మోటారు పెట్టించారు. ఆ తర్వాత రెబ్బనపల్లికి చెందిన రాజేంద్రప్రసాద్ అనే ప్రవాస పూర్వ విద్యార్థి బెంచీలు, వాటర్ ప్యూరిఫయర్ సమకూర్చారు. ఇవన్నీ చూసి.. హైదరాబాద్ నుంచి ఓ ఫౌండేషన్ డిజిటల్ ఎడ్యుకేషన్ పెట్టండి మేము మద్దతు ఇస్తామని ముందుకొచ్చింది. ఆరు కంప్యూటర్లు అందించింది. వాటితో ఒక ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నాం. పిల్లలకు కంప్యూటర్ బేసిక్స్ నేర్పేందుకు ఒక ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించి.. నా సొంత డబ్బుతో నెలకు రూ.3 వేల జీతం ఇస్తున్నాను. అలా పిల్లల సంఖ్య 190కి పెరిగింది. విద్యార్థులకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో.. దాతల సహకారంతో ఇద్దరు ప్రైవేటు టీచర్లను పెట్టుకున్నాం. అయినా మరో ఇద్దరు అవసరం అయ్యారు. సొంత నిధులతో వాళ్లనూ నియమించాను. మొత్తం ఆరుగురు టీచర్లు రావడంతో ఒక్కసారిగా అంతా మారిపోయింది. కరాటే ఇన్‌స్ట్రక్టర్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. ఆడపిల్లలకు ఆత్మరక్షణ అవసరమనే ఉద్దేశంతో ప్రత్యేక కరాటే తరగతులు నిర్వహిస్తున్నాం.

**ప్రపంచంతో పరిచయం..**

ప్రతి క్లాస్ రూమ్‌కు ఒక రీడింగ్ కార్నర్ (లైబ్రరీ) ఏర్పాటు చేశాం. అక్కడ 100 నుంచి 150 పుస్తకాలు ఉంటాయి. ఖాళీ సమయంలో వాటిని చదువుకోవచ్చు. చదవగానే సరిపోదు, మరునాడు సమీక్ష రాసుకొని రావాలనే నియమం పెట్టాం. దీనివల్ల వ్యక్తీకరణ మెరుగుపడుతుంది. ఎంతో మెరుగుపడింది కూడా. మా పిల్లలు చిన్నచిన్న కథలు రాస్తున్నారు. వాటన్నిటినీ ఓ పుస్తకంగా తీసుకొచ్చే ఆలోచన ఉంది. విద్యార్థులను తరచూ బయటికి తీసుకు వెళ్తాను. రైతులతో, గొర్రెల కాపరులతో, పంచాయతీ సిబ్బందితో.. ఇలా రకరకాల వ్యక్తులతో మాట్లాడిస్తాను. పర్యావరణ పరిరక్షణపైనా అవగాహన కల్పిస్తున్నా. ఇటీవల మట్టి వినాయకులను తయారు చేసి పంపిణీ చేశారు మా విద్యార్థులు. రెసిడెన్షియల్ స్కూల్‌లో, మోడల్ స్కూల్‌లో గణనీయమైన సీట్లు సాధిస్తున్నారు మా వాళ్లు. ఒకరికి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం లభించింది. మా తాత నోగూరి పురుషోత్తం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. మనసున్న మనిషి. ఎన్నో జీవితాను తీర్చిదిద్దారు. ఆయన స్ఫూర్తితోనే నేను ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నా. ఉద్యోగంలో చేరాక డిగ్రీ, నాలుగు పీజీలు చేశాను. పీహెచ్‌డీ చేస్తున్నాను. ఇటీవల అందుకున్న జాతీయ అవార్డును సమష్టి కృషి ఫలితంగా భావిస్తాను. బడిని బాగు చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు